సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 30 । జూలై । 2023



ఇట్లు..మీ 'శ్రేయో'భిలాషి

బహుముఖ ప్రజ్ఞ.. గౌరవప్రదమైన జీవనం.. వలంటీర్‌గా ప్రజలకు సేవతో ఓ ట్రాన్స్‌జెండర్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. 8లో



స్థిరంగా టమాట ధరలు

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.132 పలికింది. కనిష్టం రూ.100 ప్రకారం క్రయవిక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
35.8°/20.9°

జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గాలివేగం పెరిగింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో వాయువ్య దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఇంజిన్ సమస్యతో తిరుపతి రైలు ఆలస్యం



రైలు దిగి వెళ్లిపోతున్న ప్రయాణికులు

కళ్యాణదుర్గం: ఇంజిన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యతో తిరుపతి ప్యాసింజర్ రైలు మొరాయించింది. కంబదూరు మండలం కదిరిదేవరపల్లి నుంచి కళ్యాణదుర్గం, రాయదుర్గం, బళ్లారి, గుంతకల్లు, అనంతపురం మీదుగా తిరుపతి బయల్దేరాల్సిన ప్యాసింజర్ రైలు శనివారం ఆగిపోయింది. మధ్యాహ్నం 3.50 గంటలకు రాయదుర్గం చేరాల్సిన రైలు రాత్రి 8.30 గంటలకు రాయదుర్గం చేరుకుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొందరు రైలు దిగి ఆటోలు, బస్సులలో సమీప ప్రాంతాలకు చేరుకున్నారు.

తుంగభద్రకు భారీగా వరద



బొమ్మనహాళ్: ఎగువన కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. శనివారం 83,214 క్యూసెక్కుల వరద నీరు నురగలు కక్కుతూ డ్యాంలోకి వచ్చింది. ప్రస్తుతం 69.473 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి హెచ్చెల్సీ, ఎల్ఎల్సీ, రాయబసవన్న కాలువలకు 1,473 క్యూసెక్కులు వెళ్తున్నాయి. మరో మూడు రోజుల్లో జలాశయం పూర్తి స్థాయిలో నిండుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జలాశయం నిండే అవకాశం ఉండటంతో క్రస్ట్ గేట్లు ఎత్తి నదికి నీరు విడుదల చేసే అవకాశం ఉంది. ఇన్‌ఫ్లో రోజురోజుకూ పెరుగుతుండటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా సరిహద్దుకు తుంగభద్ర జలాలు

తుంగభద్ర జలాలు జిల్లా సరిహద్దులోకి ప్రవేశించాయి. జలాశయం నుంచి శుక్రవారం ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి విడుదలైన నీరు శనివారం రాత్రి 9.30 గంటలకు ఆంధ్రా సరిహద్దు బొమ్మనహాళ్ మండలంలోని 105/272వ కిలోమీటర్ రెగ్యులేటర్ వద్దకు చేరుకున్నాయి. అధికారులు గంటకు 100 క్యూసెక్కుల మేర నీటి విడుదల పరిమాణం పెంచుతున్నారు. కాగా, ఆదివారం ఉదయం హెచ్చెల్సీ అధికారులు, ఆయకట్టు రైతులు పూజలు చేసి స్వాగతం పలకనున్నారు.

ఫైరింగ్ రేంజ్‌కు స్థల పరిశీలన



బుచ్చయ్యగారిపల్లి వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: పోలీస్ ఫైరింగ్ రేంజ్‌కు అవసరమైన స్థలాన్ని ఎస్పీ మాధవరెడ్డి శనివారం పరిశీలించారు. బుక్కపట్నం– ముదిగుబ్బ ప్రధాన రహదారిలో బుచ్చగారిపల్లి వద్ద ఉన్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. బ్రిటీషర్ల కాలంలోనే పోలీస్ శాఖ కార్యకలాపాల నిమిత్తం అక్కడ 4.40 సెంట్ల భూమిని కేటాయించారు. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటైన తర్వాత పోలీసు శాఖకు ప్రత్యేకంగా ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేస్తున్నామని, ఈక్రమంలోనే స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు టైటాస్, పుట్టపర్తి రూరల్ సీఐ రామయ్య, బుక్కపట్నం ఎస్ఐ నరసింహులు పాల్గొన్నారు.

సంబరం...అంబరం

అందరిలోనూ భక్తిభావం..
ఆధ్యాత్మిక పరిమళం..
ఎటు చూసినా భక్తసాగరం.. చిన్నా, పెద్దా తేడా లేకుండా అంతా ఖాసీం స్వామి దర్శనం కోసం ఆత్రుతగా ఎదురు చూసిన క్షణం.. వివిధ గ్రామాల పీర్లతో భేటీ కోసం తరలివచ్చిన చిన్న, పెద్ద ఖాసీం స్వాముల దర్శన భాగ్యంతో ఉప్పొంగిన జన హృదయం...'బోప్పపల్లి కాశీమప్పా దసోద్దీన్' అంటూ నినదించగా బత్తలపల్లి ప్రతిధ్వనించింది.

- ఘనంగా మొహర్రం వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన బత్తలపల్లి
- వివిధ గ్రామాల పీర్లతో ఖాసీం స్వాముల భేటీ



బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో పీర్ల భేటీ

బత్తలపల్లి: గూగూడు తర్వాత అంతటిస్థాయిలో మొహర్రం ఉత్సవాలు జరిగే బత్తలపల్లి శనివారం జనసాగరమైంది. మొహర్రం వేడుకల్లో చివరిరోజైన 10వ రోజు మండల పరిధిలోని పోట్లమర్రి, గంటాపురం, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ముష్టూరు గ్రామాల పీర్లు శనివారం ఉదయం బత్తలపల్లి చిన్నఖాసీం, పెద్ద ఖాసీం స్వాములతో భేటీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆ ప్రాంతం జనసాగరాన్ని తలపించింది. చాలామంది సమీప భవనాలను ఎక్కి పీర్లను తిలకించారు. యువకులు, భక్తుల కేరింతలు, డప్పులు తప్పెట్ల మోతతో బత్తలపల్లి హోరెత్తిపోయింది. చాలామంది భక్తులు బెల్లపు ఉంటలను పీర్లపైకి విసిరి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా హిందువులు, ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. గ్రామాల వారీగా పీర్లు భేటీ అయిన తర్వాత బత్తలపల్లిలోని చావిడి వద్దకు వెళ్లి చదివింపులు చేశారు. అనంతరం ఆయా గ్రామాల పీర్లు తిరిగి వెళ్లగా, బత్తలపల్లి అగ్నిగుండం దగ్గర జంతు బలులు గావించారు. సాయంత్రం అగ్ని గుండ ప్రవేశం జరిగింది. గ్రామం చివరి వరకు పీర్లను తీసుకువెళ్లి జలధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు రంగులు చల్లుకుంటూ వసంతోత్సవం జరుపుకున్నారు. స్త్రీ, పురుష భేదం మరచి అందరూ అలావ్ తొక్కుతూ వేడుకలను సంతోషంగా జరుపుకున్నారు. అనంతరం ఆల్‌బిదాయో...అంటూ విషాద గీతం ఆలపిస్తూ మకాన్‌కు చేరుకున్నారు. వేడుకల్లో గ్రామ పెద్దలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



మిద్దెలపై నుంచి పీర్ల భేటీని తిలకిస్తున్న మహిళలు



బత్తలపల్లి చావిడి వద్ద దర్శనమిస్తున్న వివిధ గ్రామాల పీర్లు



జనసంద్రమైన బత్తలపల్లి నాలుగురోడ్ల కూడలి



పోట్లమర్రిలో అగ్నిగుండాన్ని సిద్ధం చేస్తున్న గ్రామస్తులు



అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

గూగూడు వైభవం

- ముగిసిన మొహర్రం ఉత్సవాలు
- ప్రతిధ్వనించిన కుళ్లాయిస్వామి నామస్మరణ
- అగ్నిగుండ ప్రవేశం.. ఆసక్తిగా తిలకించిన భక్తజనం



పీరుతో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న దృశ్యం

నార్పల: కుళ్లాయిస్వామి నామస్మరణతో గూగూడు ప్రతిధ్వనించింది. బ్రహ్మోత్సవాల ముగింపు రోజున ముఖ్య ఘట్టాలైన అగ్నిగుండ ప్రవేశం, గ్రామోత్సవం శనివారం కనులపండువగా జరిగాయి. తొలుత భక్తులు పీర్లస్వాములు నడిచే అగ్నిగుండంలో నిప్పులను చదును చేశారు. ప్రధాన అర్చకుడు హుస్సేనప్ప పీర్లకు చక్కెర చదివింపులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సన్నాయి వాయిద్యాల మధ్య కొబ్బరి దివిటీల వెలుగులో కొండారెడ్డి వంశస్తులు కుళ్లాయిస్వామి పీరుతో సహా తొమ్మిది పీర్లను ఎత్తుకొని తెల్లవారుజామున రెండు గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వీధిగుండా తిరిగారు. ఈ సందర్భంగా భక్తులు చక్కెర, బెల్లం, గంధాన్ని పీర్లపైకి విసురుతూ మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆరు గంటలకు అగ్నిగుండ ప్రవేశం చేశారు. మండుతున్న నిప్పుల్లోంచి పీర్లను ఎత్తుకున్నవారు అటు ఇటు వెళుతుండగా భక్తులు ఆసక్తిగా తిలకించి కుళ్లాయిస్వామి గోవిందా.. గోవింద అంటూ స్మరించారు. హిందువులు, ముస్లింలు భారీగా హాజరై మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. సాయంత్రం మూడు గంటలకు మరోమారు గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చివరగా సమీపంలోని దిగుడుబావి వద్దకు పీర్లను తీసుకెళ్లి జలధోత్సవం పూర్తి చేశారు. ప్రతి ఇల్లూ బంధుమిత్రులతో నిండిపోయింది. మేడలు ఎక్కి మరీ భక్తులు పీర్లను తిలకించి పులకించిపోయారు. పలువురు భక్తులు అన్నదానాలు నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా, కుళ్లాయిస్వామి చివరి దర్శనం సోమవారం సాయంత్రం ఆరుగంటలకు ఉంటుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి శోభ తెలిపారు.



కుళ్లాయి స్వామి పీరుకు మొక్కుతున్న భక్తులు

కిడ్నాప్ కలకలం

- అనంతపురంలో కర్ణాటక వాసి కిడ్నాప్
- సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యర్థివర్గం దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురంలో శనివారం కర్ణాటక వాసి కిడ్నాప్ కలకలం సృష్టించింది. ఇక్కడ ప్రత్యేక క్యాంప్‌లో తలదాచుకున్న ఓ వార్డు మెంబర్‌ను రెండు కార్లలో వచ్చిన ప్రత్యర్థి వర్గీయులు దాడి చేసి అపహరించుకుపోయారు. దాడి ఘటనలో బాధితుడి వర్గీయులు ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన కిడ్నాప్ ఉదంతానికి సంబంధించిన వివరాలను త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్, నాల్గవ పట్టణ సీఐ ప్రతాప్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. కర్ణాటకలోని రాయచూరు మేజర్ పంచాయతీలో పూరుతిప్పలి, తురకదోణ, అలుకూరు గ్రామాలు ఉన్నాయి. ఈ పంచాయతీలో 16 వార్డు మెంబరు స్థానాలున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీఎస్ పోటాపోటీగా అంటే చెరి ఎనిమిది స్థానాల్లో గెలుపొందాయి. గెలిచిన అభ్యర్థులు ఆగస్టు రెండో తేదీన సర్పంచ్, ఉప సర్పంచులను ఎన్నుకోవాల్సి ఉంది. సర్పంచ్ స్థానం కోసం జేడీఎస్ తీవ్ర ప్రయత్నాలు చేపట్టింది. ఒకరిని కొనుగోలు చేయాలని లేదా భయపెట్టి మెజార్టీ పెంచుకోవాలని చూసింది. వారికి ఆ ఛాన్స్ ఇవ్వకూడదని కాంగ్రెస్ పార్టీ తన వార్డుమెంబర్ల కోసం ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డు సమీపంలోని శ్రీతేజా లాడ్జిలో కాంగ్రెస్ వార్డు సభ్యులు నాగరాజు, తిప్పేనాయక్, లలీంద్ర, ఎల్లప్ప, బసిరెడ్డి, యేసు, రెడ్డెప్ప, వానేస్ బస చేశారు.

పట్టపగలే దర్జాగా కిడ్నాప్

లాడ్జికు సమీపంలోని ఓ హోటల్‌లో కాంగ్రెస్ వార్డు సభ్యులు టిఫిన్ చేసేందుకు వచ్చారు. అప్పటికే వీరి కదలికలపై నిఘా ఉంచిన ప్రత్యర్థి వర్గం రెండు కార్ల (ఇన్నోవా, ఆడీ)తో సిద్ధంగా ఉంది. వార్డుమెంబర్లలో ఒకరైన లలీంద్రను బలవంతంగా కారులోకి ఎక్కించారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మిగిలిన వారిలో మరో ఇద్దరిని అపహరించేందుకు ప్రయత్నించగా.. వారు తప్పించుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాలూ కూల్‌డ్రింక్ బాటిళ్లతో పరస్పర దాడులకు తెగబడ్డారు. లలీంద్ర వర్గీయుల్లో తిప్పేనాయక్, మరొకరు గాయపడ్డారు. అనంతరం ప్రత్యర్థి వర్గం లలీంద్రను కిడ్నాప్ చేసి కార్లలో కర్నూలు వైపు ఉడాయించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.



కిడ్నాపర్ల దాడిలో గాయపడిన తిప్పేనాయక్



కిడ్నాప్‌కు గురైన లలీంద్ర (ఫైల్)

రంగంలోకి ప్రత్యేక బృందం

బాధితుడు తిప్పేనాయక్ ఫిర్యాదుతో కిడ్నాప్‌ను ఛేదించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. హైఅలర్ట్ యాప్‌తో జిల్లా వ్యాప్తంగా పోలీసులతో రహదారులపై వాహనాల తనిఖీలు చేయించారు. పోలీసులు జేడీఎస్ అభ్యర్థులతో ఫోన్‌లో మాట్లాడారు. లలీంద్రను వదిలిపెట్టాలని ఆదేశించగా.. తాము ఎవరినీ కిడ్నాప్ చేయలేదని అటు వైపు నుంచి సమాధానమిచ్చారు. దీంతో పోలీసులు వివిధ రూట్లల్లో గాలింపు చేపట్టారు.

మడకశిర పోలీసు సర్కిల్ విభజన?

- మడకశిర టౌన్, మడకశిరరూరల్ సర్కిళ్ల ఏర్పాటుకు కసరత్తు



మడకశిర పోలీస్‌సర్కిల్ కార్యాలయం

మడకశిర: నేరాల నియంత్రణ, సేవలు వేగవంతంగా అందించే క్రమంలో మడకశిర పోలీసు సర్కిల్‌ను రెండుగా విభజించడానికి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. మడకశిర పోలీస్ సర్కిల్ 1993లో ఏర్పాటైంది. ప్రస్తుతం సర్కిల్ పరిధిలో మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ముఖ్యంగా మడకశిర మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారింది. ఈ నేపథ్యంలో సర్కిల్ కార్యాలయంపై పనిభారం పెరిగింది. ప్రధానంగా సర్కిల్‌లోని పోలీసు స్టేషన్లన్నీ కర్ణాటక సరిహద్దులో ఉంటాయి. అగళి, అమరాపురం పోలీస్‌స్టేషన్లు మడకశిరలోని సర్కిల్ కార్యాలయానికి దాదాపు 45 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. ఈ పరిస్థితిల్లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అన్ని స్టేషన్ల పరిధుల్లోని కేసులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మడకశిర పోలీస్ సర్కిల్‌ను మడకశిర టౌన్, మడకశిర రూరల్ సర్కిళ్లుగా విభజించడానికి పోలీస్ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. మడకశిర రూరల్ సర్కిల్‌లోకి అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి పోలీస్‌స్టేషన్లను తీసుకువచ్చి, మడకశిర టౌన్ సర్కిల్ పరిధిలోకి మడకశిర మండలం, మడకశిర పట్టణాన్ని తీసుకురావడానికి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా మడకశిర పోలీస్‌స్టేషన్‌ను కూడా టౌన్, రూరల్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి కసరత్తు జరుగుతున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే ప్రభుత్వం జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ముద్దాయి అరెస్ట్



ముద్దాయి వెంకటరమణ

అమడగూరు: ఓడీ చెరువు మండలంలో 2009లో నమోదైన కేసులో ముద్దాయిగా ఉన్న సాత్పాటి వెంకటరమణను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. 2009లో ఓడిచెరువు మండలంలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైరు చోరీ చేసిన ఘటనల్లో నలుగురు ముద్దాయిలపై కేసులను నమోదు చేశారు. ఈ క్రమంలో అప్పుడే ఇద్దరిని పట్టుకుని కోర్టులో ప్రవేశపెట్టగా, జడ్జి వారికి 7 నెలల కఠిన కారాగార శిక్షను విధించారు. మరో ఇద్దరు తప్పించుకుని తిరుగుతుండగా, వారిలో ఒకరైన సాత్పాటి వెంకటరమణ శనివారం అరెస్ట్ చేశారు. అనంతరం జడ్జి ఆదేశాల మేరకు జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జనసేన నేత ఆకుల ఉమేష్‌పై కేసు

- బాగేపల్లిలోని ఓ ధాబాలో తప్పతాగి రమేష్‌బాబు అనే వ్యక్తిపై దాడి



పవన్ కళ్యాణ్‌తో ఆకుల ఉమేష్ (ఫైల్)

చిలమత్తూరు: మద్యం సేవించడానికి కర్ణాటకలోని బాగేపల్లికి వెళ్లిన హిందూపురం జనసేన నాయకుడు ఆకుల ఉమేష్, అతని స్నేహితుల బృందం తప్పతాగి అమడగూరు మండలానికి చెందిన రమేష్‌బాబుపై దాడి చేసి గాయపరిచారు. అతని వద్ద ఉన్న బంగారాన్ని చోరీ చేశారు. దీంతో బాధితుని ఫిర్యాదు మేరకు బాగేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... ఈ నెల 23న కంటి వైద్య పరీక్షల కోసం రమేష్‌బాబు అనే వ్యక్తి బెంగళూరుకు వెళ్తూ బాగేపల్లి సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై ఓ ధాబా వద్ద భోజనానికి ఆగాడు. ఆ సమయంలో తాగి ఉన్న ఆకుల ఉమేష్, అతని మిత్ర బృందం రమేష్‌బాబుపై దాడిచేసి అతని ఒంటిపై 16 తులాల బంగారు ఆభరణాలను లాక్కెళ్లారు. దీంతో బాధితుడు ఫిర్యాదు మేరకు జనసేన నాయకులపై 323, 363, 392, 511 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు బాగేపల్లి సీఐ రవికుమార్ తెలిపారు. కేసులో ఆకుల ఉమేష్ ఏ–1 నిందితుడు కాగా, లోకేష్ అనే వ్యక్తి ఏ–2, చిలమత్తూరు మండలానికి చెందిన జనసేన నాయకుడు ప్రవీణ్ ఏ–3, భాస్కర్ ఏ–4గా పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో ఉమేష్ హిందూపురం జనసేన అభ్యర్థిగా పోటీ చేశారు. ఇతనిపై హిందూపురంలో కూడా కేసులు ఉన్నట్టు తెలుస్తోంది.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉద్యోగుల సొసైటీ ఎన్నికలు

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లా విద్యుత్ ఉద్యోగుల కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనుంది. అనంతపురంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలను పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేశారు. ఫలితాలను సాయంత్రంలోపు ప్రకటించనున్నారు. 11 మంది డైరెక్టర్లు ఉన్న సొసైటీకి వైఎస్సార్, ఓసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో ఒక ప్యానెల్ పోటీలో ఉండగా మరో ప్యానెల్‌లో 1104, 327 ఉద్యోగ సంఘాల సభ్యులు ఉన్నారు. మొత్తం 23మంది అభ్యర్థులు డైరెక్టర్ల స్థానాలకు పోటీ చేస్తున్నారు.

వేమనపై కవితా సంకలనం

అనంతపురం సెంట్రల్: మహాకవి వేమనపై కవితా సంకలనం తీసుకురానున్నట్లు వేమన ఫౌండేషన్ కార్యదర్శి అప్పిరెడ్డి హరినాథరెడ్డి ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేమన జీవితం, సాహిత్యం, తాత్వికత, గొప్పదనంపై ఇప్పటికే అనేక మంది ప్రముఖ కవులు, వీరబ్రహ్మం మొదలు గుర్రం జాషువా, బెళ్లూరి శ్రీనివాసమూర్తి, జంధ్యాల పాపయ్యశాస్త్రి లాంటి మహోన్నత వ్యక్తులు రాసిన పద్యాలు, కావ్యాలు, గేయాలు సేకరించినట్లు తెలిపారు. ఇతర బాషాల కవులు రాసిన కవితలను సైతం సేకరిస్తున్నట్లు వివరించారు. మారుమూల ప్రాంతాల్లో వెలుగులోకి రాని ఎన్నో పద్యాలు కవితా సంకలనంలో సమగ్రం చేర్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఎవరి వద్దనైనా అరుదైన పద్యాలు, కవితలు అందుబాటులో ఉంటే వాటి గురించి 99639 17187 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలు

పరిగి: అన్నమయ్య జిల్లా వాయల్పాడులోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ చేపట్టినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల శనివారం ఓ ప్రకటన విడుదల చేసినట్లు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కొడిగెనహళ్లి పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.మురళీధర్‌బాబు తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీలకు 7, ఎస్టీలకు 4, మైనార్టీ విభాగంలో 39 సీట్లు ఖాళీలున్నాయన్నారు. 6వ తరగతిలో ఎస్సీలకు 2, ఎస్టీలకు 2, మైనార్టీలకు 10 సీట్లు, 7వ తరగతిలో ఎస్సీలకు 5, మైనార్టీలకు 14 సీట్లు, 8వ తరగతిలో ఎస్సీలకు 3, ఎస్టీలకు 1 సీటు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇప్పటికే ప్రవేశ పరీక్షలు రాసి సీట్లు పొందని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులన్నారు. మైనారిటీ విద్యార్థులు నేరుగా పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌ను సంప్రదించి అడ్మిషన్ పొందవచ్చునన్నారు. పూర్తి వివరాలకు 98665 59649లో సంప్రదించాలని సూచించారు.

ఇట్లు.. మీ శ్రేయోభిలాషి

ట్రాన్స్‌జెండర్ అంటే సమాజంలో ఓ రకమైన చిన్నచూపు. 'మూడో'రకం మనుషులంటూ హేళనభావం. అనుచితంగా ప్రవర్తిస్తారని, బెదిరించి డబ్బు వసూలు చేస్తారనే అపవాదు. కానీ అందరు ట్రాన్స్‌జెండర్లూ అలా ఉండరు. మానవత్వం మూర్తీభవించి ఆపన్నులకు అండగా నిలిచేవారు, సమాజానికి సేవ చేయాలని తపనపడే వారూ ఉన్నారు. యాచనకు దూరంగా స్వశక్తితో హుందాగా, గౌరవంగా బతుకుతున్న వారూ ఉన్నారు. అలాంటి వారిలో శ్రేయదాస్ ఒకరు.


వృద్ధురాలితో బయోమెట్రిక్ వేయిస్తున్న శ్రేయదాస్

- వలంటీరుగా రాణిస్తున్న ట్రాన్స్‌జెండర్
- ఉత్తమ సేవలతో ప్రజల ప్రశంసలు
- స్ఫూర్తిదాయకం..శ్రేయదాస్ జీవితం

సాక్షి, అనంతపురం డెస్క్: ఉరవకొండ పట్టణానికి చెందిన శ్రేయదాస్ గ్రామ వలంటీరుగా పనిచేస్తున్నారు. తన క్లస్టర్ పరిధిలోని ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ ప్రశంసలు చూరగొంటున్నారు. తన పనితీరుతో అధికారుల మన్ననలూ పొందుతున్నారు. ఈమె బహుశా రాష్ట్రంలోనే వలంటీరుగా పనిచేస్తున్న ఏకైక ట్రాన్స్‌జెండర్! గౌరవంగా బతకాలన్న దృఢసంకల్పం, సమాజానికి సేవ చేయాలన్న తపనతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ఎన్ని కష్టాలొచ్చినా ధైర్యంగా ఎదుర్కొన్నారు.

కన్నీటి పయనం..

శ్రేయదాస్ సొంతూరు ఉరవకొండ పట్టణమే. చిన్నప్పుడు అబ్బాయి లాగా ఉండేవారు. తల్లిదండ్రులూ అలాగే అనుకున్నారు. మిగిలిన అబ్బాయిలతో కలసి స్థానిక ప్రభుత్వ పాఠశాలకు పంపించారు. పదో తరగతి వరకు అక్కడే చదివారు. కానీ తాను అబ్బాయిని కాదన్న విషయం శ్రేయదాస్‌కు తెలుసు. ఆ విషయం ఇంట్లో చెప్పాలంటే భయం. చివరికి ఎలాగోలా విషయం బయటపడింది. కొంతకాలానికి తల్లి కూడా చనిపోయింది. కుటుంబ సభ్యుల నుంచి ఛీదరింపులు ఎక్కువయ్యాయి. చివరకు తండ్రి కూడా అండగా నిలవలేదు. దీంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చేశారు. తలదాచుకోవడానికి అద్దె ఇల్లు కూడా దొరకని పరిస్థితి. చాలా కాలం పాటు స్థానిక కందారమ్మ ఆలయమే ఆశ్రయమైంది.

'ఉన్నత' లక్ష్యం

ఇంటి నుంచి బయటకొచ్చేసిన తర్వాత శ్రేయదాస్ పొట్ట నింపుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వచ్చింది. మిగిలిన ట్రాన్స్‌జెండర్ల లాగా యాచించడం తనకు ఇష్టం లేదు. కానీ ఆకలి తీరాలంటే ముందున్న మార్గం అదొక్కటే. అయిష్టంగానే సుమారు మూడేళ్ల పాటు యాచనతో బతుకు నెట్టుకొచ్చారు. ఓ దుకాణం వద్దకు యాచించడానికి వెళ్లిన ఆమె ఇంగ్లిష్ నేమ్‌బోర్డును స్పష్టంగా చదవడాన్ని అక్కడే నిల్చొన్న ఓ వ్యక్తి గమనించారు. ఏమి చదివారంటూ ఆరా తీశారు. టెన్త్ చదివానని, పైచదువులు చదవాలన్న కోరిక ఉందని చెప్పారు. దీంతో గుంతకల్లులోని సత్యసాయి జూనియర్ కళాశాలలో అడ్మిషన్ చేయించారు. ఇంటర్మీడియట్ తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ (బీఏ) పూర్తి చేశారు. ఇదే యూనివర్సిటీలో పీజీ (ఎంఏ) అడ్మిషన్ పొంది ఫస్టియర్ ఉత్తీర్ణులయ్యారు. ఇతరత్రా కారణాల వల్ల సెకండియర్‌లో డిస్‌కంటిన్యూ అయ్యారు. తన చదువుకు 'జెండర్' సమస్య అడ్డొచ్చినప్పటికీ పట్టుదలతో అధిగమించి ముందుకు సాగారు.

స్వశక్తితో జీవనయానం

శ్రేయదాసుకు వలంటీరుగా గౌరవ వేతనంతో పాటు ట్రాన్స్‌జెండర్‌గా పింఛన్ కూడా వస్తోంది. ఇంట్లోనే టైలరింగ్ చేస్తున్నారు. యూట్యూబ్ ద్వారా మెలకువలు నేర్చుకుని బ్యూటీషియన్‌గానూ మారారు. ఇళ్ల వద్దకే వెళ్లి బ్యూటీషియన్‌గా సేవలందిస్తున్నారు. డ్వాక్రా సంఘం సభ్యురాలిగా ఉన్నారు. ఈమెకు ప్రభుత్వం జగనన్న కాలనీలో ఇంటి స్థలాన్ని కేటాయించింది. సొంతింటి నిర్మాణాన్ని ప్రారంభించారు.

హేళన చేసిన చోటే ప్రశంసలు

గ్రామ/వార్డు వలంటీర్ల నియామక నోటిఫికేషన్‌లో ట్రాన్స్‌జెండర్లు కూడా దరఖాస్తు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో శ్రేయదాస్ దరఖాస్తు చేసుకున్నారు. ఆమె సంకల్పాన్ని గుర్తించిన అధికారులు గ్రామ వలంటీరుగా అవకాశం కల్పించారు. 2019 ఆగస్టు 15న గ్రామ వలంటీరుగా సేవలు ప్రారంభించారు. మొదట్లో తనను చాలామంది హేళన చేశారు. 'ఇలాంటి' వలంటీరునా తమకు కేటాయించిందంటూ ప్రజలు కూడా చిన్నచూపు చూశారు. కానీ అందరి అపోహలను ఆమె పటాపంచలు చేశారు. ఉత్తమ సేవలతో హేళన చేసిన చోటే ప్రశంసలు చూరగొంటున్నారు. ఈ క్రమంలో 'సేవామిత్ర' అవార్డు కూడా పొందారు. 'ఆపదమిత్ర'గా జిల్లా స్థాయి శిక్షణ తీసుకున్నారు. అందులోనూ మొదటి బహుమతి కైవసం చేసుకున్నారు.

గౌరవంగా బతుకుతున్నా..

వలంటీరుగా చేరినప్పుడు చాలామంది హేళన చేశారు. సొంత కమ్యూనిటీ నుంచి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. అయినా కొందరి ప్రోత్సాహం, అధికారుల సహకారంతో ధైర్యంగా ముందుకు సాగాను. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ భారతి మేడం, వీఆర్వో అరుణ మేడం సహకారం మరువలేనిది. మొదట్లో కాస్త ఇబ్బంది ఉన్నప్పటికీ ఇప్పుడు క్లస్టర్ పరిధిలోని ప్రజలు కూడా బాగా సహకరిస్తున్నారు. ఆత్మీయురాలిగా చూస్తుండడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం ఇచ్చిన తోడ్పాటుతో గౌరవంగా బతుకుతున్నా. ట్రాన్స్‌జెండర్లు అందరూ చెడ్డవారు కాదు. మాలోనూ మంచోళ్లు ఉన్నారు. కాబట్టి కొందరి ప్రవర్తనను బట్టి అందరినీ చెడ్డవాళ్లుగా ముద్ర వేయొద్దు. సమాజంలో గౌరవం, సమాన అవకాశాలు లభిస్తే నాలాగా స్వశక్తితో బతకడానికి చాలామంది సిద్ధంగా ఉన్నారు.

– శ్రేయదాస్, గ్రామ వలంటీరు, సచివాలయం–3, ఉరవకొండ



● భక్తజనసంద్రం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏకాదశిని పురస్కరించుకుని శనివారం ఉదయం కదిరి పరిసర ప్రాంతాల నుంచే కాక చుట్టుపక్కల జిల్లాలు, పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఖాద్రీశుని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రాయితీతో రైతులకు చాఫ్‌కట్టర్లు

- ఉమ్మడి జిల్లాకు 350 యంత్రాల మంజూరు


గడ్డి కత్తిరించే యంత్రాలు

అనంతపురం అగ్రికల్చర్: గడ్డి కత్తిరించే చాఫ్‌కట్టర్లను రాయితీతో పాడి రైతులకు అందజేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వై.సుబ్రహ్మణ్యం, ఏడీ డాక్టర్ నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం 'సాక్షి'తో వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఉమ్మడి అనంతపురం జిల్లాకు 350 చాఫ్ కట్టర్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో అనంతపురం జిల్లాకు 200, శ్రీసత్యసాయి జిల్లాకు 150 యంత్రాలను కేటాయించినట్లు వివరించారు. వీటిని అర్హత కలిగిన పాడి రైతులకు 40 శాతం రాయితీతో అందజేస్తున్నట్లు తెలిపారు. రెండు హెచ్‌పీ సామర్థ్యం, మూడు బ్లేడులు కలిగిన ఒక్కో చాఫ్‌కట్టర్ పూర్తి విలువ రూ.33,970 కాగా, ఇందులో 40 శాతం రాయితీ రూ.13,588 పోనూ రైతులు తమ వాటా కింద రూ.20,382 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. తమ వాటా చెల్లించిన రైతులకు నెల రోజుల్లోపే వారి గ్రామాల్లోనే ఆర్‌బీకే వేదికగా వీటిని అందజేస్తామన్నారు.

'బాస్కెట్ బాల్'తో అంతర్జాతీయ గుర్తింపు

- సీఐ సుబ్రహ్మణ్యం


శిక్షణ పొందిన క్రీడాకారులతో స్పెయిన్ కోచ్‌లు, ప్రముఖులు

ధర్మవరం అర్బన్: బాస్కెట్‌బాల్ క్రీడతో అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని క్రీడాకారులకు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా సాగుతున్న స్పెయిన్ కోచ్‌లో ప్రత్యేక శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, సీఐ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బాస్కెట్ బాల్ క్రీడాభివృద్ధికి స్పెయిన్ దేశానికి చెందిన ఈగల్ బాస్కెట్‌బాల్ క్లబ్‌కు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఆ దేశ బాస్కెట్‌బాల్ కోచ్‌లు మార్, ఒరియోల్, నటాలియా, పోల్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

గోరంట్ల: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో మట్కా రాస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ సుబ్బరాయుడు వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో పోలీసులు అప్రమత్తమై శనివారం ఉదయం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గోరంట్లలోని జియో కార్యాలయ సమీపంలో మట్కా రాస్తూ టైలర్ కురాకుల రవి పట్టుబడ్డాడు. ఇతని నుంచి రూ.1,20,020 నగదుతో పాటు మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే బాచన్నపల్లిలో రంగప్ప, కర్ణాటక ప్రాంతానికి చెందిన ముత్యాలప్ప మట్కా రాస్తూ పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.50,030 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

ప్రేమ విఫలం.. యువతి బలవన్మరణం


అఖిల (ఫైల్)

పెనుకొండ రూరల్: మూడేళ్ల ప్రేమ బంధాన్ని పెద్దలు కాదన్నారు. సమీప బంధువులే అయినా మూడుముళ్ల బంధానికి నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పెనుకొండ మండలం మరువపల్లికి చెందిన గొల్ల అఖిల (19), అదే గ్రామానికి చెందిన సమీప బంధువు గోవర్దన్ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న గోవర్దన్ తల్లిదండ్రులు వారి ప్రేమను నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన అఖిల శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో పూల మొక్కలకు వాడే క్రిమి సంహారక మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే అఖిల మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పెనుకొండ ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

ప్రమాదంలో దంపతులకు గాయాలు

బత్తలపల్లి: ఆటో ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన నాగార్జున, మంజుల దంపతులు. శనివారం ఉదయం వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై ముదిగుబ్బకు బయలుదేరారు. బత్తలపల్లి మండలం గుమ్మళ్లకుంట క్రాస్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన ఆటో ఢీకొంది. ఘటనలో రెండు వాహనాలూ బోల్తాపడ్డాయి. తీవ్రంగా గాయపడిన దంపతులను స్థానికులు వెంటనే హైవే అంబులెన్స్ ద్వారా ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలుకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ పరారీ ఉన్నట్లు సమాచారం. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పేలిన గ్యాస్ సిలిండర్

- వివాహితకు తీవ్ర గాయాలు
- పరామర్శించిన ఎమ్మెల్యే దుద్దుకుంట


ఘటనపై బాధితులతో ఆరా తీస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: గ్యాస్ లీకేజీ కారణంగా పేలుడు చోటు చేసుకుని ఓ ఇల్లు ధ్వంసమైంది. వివాహితకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... కొత్తచెరువు మండలం వంగంపల్లికి చెందిన గంగమ్మ ఆలయ పూజారిగా మాధవరాజు జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం గ్యాస్ ఏజెన్సీ డెలివరీ బాయ్ వచ్చి సిలిండర్ ఇచ్చి వెళ్లిపోయాడు. దీంతో రాత్రికి కొత్త సిలిండర్‌కు రెగ్యులేటర్ అమర్చి కుటుంబసభ్యులంతా మరో చోట నిద్రించారు. అయితే సిలిండర్ వాచర్, పిన్ దెబ్బతినడంతో నెమ్మదిగా గ్యాస్ లీకవుతూ వచ్చింది. ఈ విషయం తెలియని పూజారి భార్య రాజేశ్వరి శనివారం వేకువజామున నిద్ర లేచి స్నానం చేసేందుకని ఇంటి బయట ఉన్న కట్టెల పొయ్యిపై నీళ్లు కాచేందుకు నిప్పు రాజేసింది. అప్పటికే ఇంటి లోపల నిండుకున్న గ్యాస్.. బయట మండుతున్న పొయ్యి మంటను తాకడంతో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. రాజేశ్వరి తీవ్రంగా గాయపడింది. చుట్టుపక్కల వారు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగు తీశారు. మాధవరాజు ఇల్లు పైకప్పు పేలిపోయింది. సామగ్రి మొత్తం చెల్లాచెదురైంది. నిత్యావసర వస్తువులు, దుస్తులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.10 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. తీవ్రంగా గాయపడిన రాజేశ్వరిని స్థానికులు వెంటనే సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని వైద్యశాలకు వైద్యులు రెఫర్ చేశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. వంట గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల అజాగ్రత్తనే ప్రమాదానికి కారణంగా స్థానికులు ఆరోపించారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

వంట గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనను తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం ఉదయం వంగంపల్లికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఘటనపై ఆరా తీశారు. తన వంతు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రమాదానికి కారకులైన గ్యాస్ ఏజెన్సీపై చర్యలకు సిఫారసు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట సర్పంచ్‌లు శ్రీనివాసులు, సంజీవరాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, సాంబశివారెడ్డి, గంగప్ప, శివ, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ హఠాన్మరణం


నాగభూషణం (ఫైల్)

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో అనంతపురం జిల్లా రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న నాగభూషణం మృతి చెందారు. అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నివాసముంటున్న ఆయన శనివారం ఉదయం వాకింగ్ ముగించుకుని ఇంట్లోకి వెళుతుండగా గుండెపోటుకు గురై మెట్ల మీద నుంచి కింద పడ్డారు. దీంతో తలకు, కాళ్లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందారు. కాగా, రాప్తాడు మండలం బుక్కచెర్ల గ్రామానికి చెందిన నాగభూషణం 1991లో నిర్వహించిన గ్రూప్–2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగిగా చేరారు. అప్పటి నుంచి సబ్ రిజిస్ట్రార్‌గా పామిడి, బుక్కపట్నంతోపాటు అనంతపురం డీఐజీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా సుదీర్ఘకాలం పని చేస్తూ పదోన్నతిపై రిజిస్ట్రార్‌గా కర్నూలు, శ్రీకాకుళం జిల్లాల్లో పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఏడాది క్రితం అనంతపురం జిల్లాకు వచ్చారు. మంచి అధికారిగా, సౌమ్యుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. నాగభూషణం మృతి చెందారన్న విషయం తెలుసుకున్న ఆ శాఖ డీఐజీ మాధవి నేరుగా ఆస్పత్రికి చేరుకుని రిజిస్ట్రార్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం నాగభూషణం భార్య నళినిని ఓదార్చారు.

సర్పంచ్ కుమారుడిపై దాడి

బత్తలపల్లి: మండలంలోని ఓబుళాపురం సర్పంచ్ బండి సరస్వతి కుమారుడు పవన్‌కుమార్‌పై బత్తలపల్లికి చెందిన కొందరు దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని కోడేకండ్ల గ్రామంలో జరుగుతున్న మొహర్రం ఉత్సవాలకు పూలు తీసుకువచ్చేందుకు బెంగళూరుకు స్థానికులతో కలసి పవన్‌కుమార్ ప్రయాణమయ్యాడు. వీరు ప్రయాణిస్తున్న స్కార్పియో బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం డ్రైవర్ ఉన్నఫళంగా కుడివైపు తిప్పాడు. రెండు వాహనాలకు త్రుటిలో ప్రమాదం తప్పింది. అయితే ఈ ఘటనపై రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో పవన్‌కుమార్‌పై బొలెరో వాహన డ్రైవర్ వెంకటనారాయణ దాడి చేసి, గాయపరిచాడు. దీంతో ఆగ్రహించిన స్కార్పియో వాహనంలోని వారు ప్రతి దాడి చేయడంతో వెంకటనారాయణ భార్య, బంధువులు అక్కడకు చేరుకుని విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. ఘటనలో పవన్‌కుమార్, మోహన్‌కుమార్, ఉపేంద్ర, నరేష్, వెంకటనారాయణకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బత్తలపల్లి ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష సంఘటనాస్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం క్షతగాత్రులను ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరస్పర ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.